సిఎస్‌కు ఎయిర్ షో జ్ఞాపిక బహూకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ఎయిర్‌ఫోర్స్ అధికారులు "సూర్యకిరణ్ ఎయిర్ షో" కు సంబంధించిన కెప్టెన్ అజయ్ దాశరధి ఎయిర్ షో జ్ఞాపికను బహూకరించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి నేతృత్వంలో భారత వైమానిక దళం ప్రత్యేక ఎయిర్ షో జరగనున్నది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మరోసారి భూకంపం

- నాలుగు రోజుల్లో రెండోసారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లాలోని దాసరిపల్లి కేంద్రంగా రిక్టారు స్కేల్‌పై 3.0గా భూకంపం నమోదైనట్టు అధికారులు తెలిపారు. భూమి లోపల సుమారు 10 కిలో మీటర్ల లోతున భూప్రకంపనలు వచ్చినట్టు వెల్లడించారు. నాలుగు రోజుల్లో రెండోసారి భూకంపం వచ్చింది. శనివారం మధ్యాహ్నం 12.15 నిమిషాలకు మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండల పరిధిలోని దాసరిపల్లి కేంద్రంగా పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ప్యాన్లు, కూర్చీలు ఊగడంకనిపించింది. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీవారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ జాతికి అంకితం

- ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం పూర్తి చేస్తాం
- ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధుల విడుదల
- సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు జమ : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తున్నాం.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల వద్ద ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ పైలాన్‌ను శనివారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని 2వ యూనిట్‌ను ప్రారంభించారు. నల్లగొండ పట్టణంలో 270 కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల ప్రారంభం, 40 కోట్లతో నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవన పనులకు శంకుస్థాపన చేశారు. నూతన గ్రంథాలయ భవనం, స్కిల్ సెంటర్, పలు మండలాల్లో నిర్మించ తలపెట్టిన జూనియర్ కళాశాలల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలో గంధంవారి గూడెం వద్ద రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సిఎం ప్రసంగించారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఫ్లోరైడ్ మహమ్మారితో బాధపడిన నల్లగొండ జిల్లాకు స్వరాష్ట్రంలో కూడా విముక్తి కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించడంలో నల్లగొండ జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. మలిదశ ఉద్యమంలో మంత్రి పదవి త్యాగం చేసింది కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అని గుర్తు చేశారు. మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన అమరవీరుడు శ్రీకాంతాచారిది ఈ జిల్లానే అని చెప్పారు. నిజాంలను తరిమికొట్టిన సాయుధ రైతాంగ పోరాటానికి ఈ జిల్లా నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. ఎర్రజెండాల పోరాటాల గడ్డ అని తెలిపారు. ఫ్లోరైడ్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 44 కి.మీ. సొరంగ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో వేగవంతంగా పూర్తి చేస్తామని ప్రకటించారు. 3.5 లక్షల

ఎకరాలకు సాగునీరు, 500పైగా గ్రామాలకు తాగు నీరు అందించే ఎస్-ఎల్‌బిసి, లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే ఉదయ సముద్రం ప్రాజెక్టును వైఎస్ఆర్ హయాంలో మంజూరు చేశారన్నారు. గతంలో కెసిఆర్ వీటిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. 18 సంవత్సరాల నిరీక్షణ అనంతరం నేడు 50 వేల ఎకరాలకు నీరు అందించే విధంగా ప్రారంభించుకున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కెసిఆర్ పాలనలోనే నల్లగొండ జిల్లాకు అధికంగా అన్యాయం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బిసి, ఉదయ సముద్రం, పిలాయి కాలువ, ధర్మారెడ్డి కాల్వ మొదలగు పనులను పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొస్తామన్నారు.

అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలి

ప్రధాన ప్రతిపక్షం అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలని, గతంలో తమ నాయకులు జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకులుగా పని చేశారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, వారి అనుభవనాలను ప్రజల కోసం వినియోగించాలని కోరారు.

ఫ్యాక్టరీ, పరిశ్రమలు, ఆర్ఆర్ఆర్, ఫ్యూచర్ సిటీ, మెడికల్ కాలేజీ, ఫాక్స్‌కాన్ కంపెనీ వంటి ప్రతి అంశానికీ ప్రతిపక్షనాయకులు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలు పెట్టొద్దు.. ఉద్యోగాలు ఇవ్వొద్దు.. అనే రీతిలో ఉంటే ఎలా? ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంలో 1200 మంది అమరుల త్యాగం వృథా కారాదని చెప్పారు.

సంక్రాంతి తర్వాత రైతు భరోసా

గతంలో కెసిఆర్ చేసిన అప్పులకు మనం రూ.65 వేల కోట్ల మిత్తి, అసలు చెల్లించాం.. సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు జమ అవుతాయి.. అని సిఎం ప్రకటించారు. ఆనాడు వైఎస్ఆర్ చేతుల మీదుగా రింగ్ రోడ్డు, నేడు వెంకన్న చేతుల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు, 50 వేల ఎకరాల్లో కొత్త సిటీ నిర్మించి నిరుద్యోగ సమస్య పరిష్కరించేలా అంతర్జాతీయ కంపెనీలను తీసుకొస్తామని చెప్పారు. జిల్లా ప్రజల కష్టాలు చూసి మూసీ నది ప్రక్షాళన చేస్తున్నామని, దీనితో పరిశ్రమల వ్యర్థాల నుంచి విముక్తి కల్పిస్తామని అన్నారు. అభివృద్ధి కావాలంటే ఎవరో ఒక్కరు కొంత భూమి కోల్పోవాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్ రెడ్డి, వీరేశం, రాజగోపాల్ రెడ్డి, బాలు నాయక్, బీర్ల ఐలయ్య, మందుల సామేల్, టిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, సిఇ సమ్మయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీనియర్ నాయకులు నేతి విద్యాసాగర్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్‌పి శరత్ చంద్ర పవార్, జిల్లా ప్రాజక్టుల ఈఎన్‌సి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE VIII ADDL DISTRICT JUDGE AT VIJAYAWADA
MVOP NO. 275/2021

Between:
1. Aratipamula Venkateswara Chari ... Petitioners

AND

1. M. Durga Prasad Goud and 2 others .... Respondents

To,
Respondent -1
M. Durga Prasad Goud S/o Nagaya Goud, D.No. 4-10-395/cs1, DVK Road, Chaithanya puri, Nalgonda, Nalgonda Dist.

పై నెంబర్ పిటిషన్‌ను పిటిషనర్ తనకు జరిగిన రోడ్డు ప్రమాదంలో తగిలిన గాయములకు నష్ట పరిహారం కోరుతూ పై పిటిషన్‌ను దఖలు చేయగా సదరు 1వ రెస్పాండంట్ అయినా మీయొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.30-12-2024 నకు వాయిదా వేసి వున్నారు. కావున తేది.30-12-2024 ఉదయం గం. 10:30 ని.లకు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల పరోక్షంగా తీర్మానించబడును.

/// By court Order ///
B. Surya Prakasa Rao, Advocate
VIjayawada. Cell:9849695243.

ప్రమాదంలో దేశం, రాజ్యాంగం

- కార్మిక చట్టాలపై దాడి చేస్తున్న బిజెపి
- హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహాసభలో పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

మన దేశం, రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నాయని, కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడో మహాసభ శనివారం ప్రగతినగర్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సుందరయ్య భవన్ నుంచి నీలా సుందరయ్య భవన్ వరకు ప్రజాప్రదర్శన నిర్వహించారు. సీతారాం ఏచూరి సహా పలువురు నాయకుల చిత్ర పటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న సంక్షోభం తాత్కాలికమేనన్నారు. పెరుగుతున్న దారిద్ర్యం, ఆర్థిక సంక్షోభానికి పెట్టుబడిదారి విధానాలు పరిష్కారం చూపలేకపోతున్నాయని చెప్పారు. ఓ వైపు ఆకలితో పేదలు అల్లాడిపోతుంటే, మరోవైపు సంపన్నులు పెరిగిపోతున్నారని అన్నారు. శ్రీలంకలో ప్రజానాడి పట్టుకుని సమస్యలపై పోరాటం చేయడం వల్లే అక్కడ వామపక్ష ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కమ్యూనిస్టులు లేని పోరాటాలు సరైన మార్గంలో సాగవన్నారు. దేశంలో పెద్దఎత్తున జరిగిన రైతు ఉద్యమానికి నాంది పలికింది కూడా కమ్యూనిస్టులే అని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వ హయాంలో రైతులపై దాడులు పెరగడంతోపాటు రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. రైతులు పెద్దఎత్తున ఉద్యమించడం వల్ల ఆ చట్టాలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజల్లో బిజెపి పై అసంతృప్తి పెరుగుతోందన్నారు. అయితే, వారు పోరాటాల్లోకి రాకుండా చేస్తున్న కుట్రలను బహిర్గతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నేడు రాజకీయాలు, ప్రభుత్వాలు మతాల ఆధారంగానే ముందుకు సాగుతున్నాయని, ఓట్లను కూడా ఇదే తరహాలో అడుగుతున్నాయని చెప్పారు. సున్నితమైన అంశాలతో ప్రజలు కొట్టుకుంటూ ఉంటే బిజెపి తన పని తాను చేసుకుంటూ పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలను సృష్టిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు యత్నిస్తోందని అన్నారు.

రాష్ట్రంలో ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్పా ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ కానీ రైతులు ఇప్పటికీ వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. కార్మికుల వేతన సవరణ జీఓ ఇచ్చిన ప్రభుత్వం అమలును మరిచిందన్నారు. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతినిచ్చి, అక్కడికి వచ్చే వారిని అరెస్టు చేయడమే ప్రజాస్వామ్యమా..? అని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ లాగే నేడు రేవంత్‌రెడ్డి కూడా తాను ఏ జిల్లాకు వెళ్తే అక్కడ వామపక్ష నాయకులను అరెస్టు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డిజి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుహెచ్‌విసిగా బాలకృష్టారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెఎన్‌టియుహెచ్ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్‌వి.బాలకృష్టారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రెక్టర్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల డైరెక్టర్లు, విశ్వవిద్యాలయ అనుబంధ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు తమ విభాగాల్లో జరుగుతున్న ప్రస్తుత కార్యక్రమాలు, తదుపరి అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలపై ప్రాథమిక సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్టారెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తన సహకారం అందిస్తానని చెప్పారు. అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేసేలా కృషి చేస్తామన్నారు. వచ్చే రోజుల్లో అన్ని కార్యక్రమాలనూ సమీక్షించేందుకు తన పూర్తి సహాయాన్ని అందిస్తానన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం ఏ మార్పు కావాలన్నా,అవసరమైనసహాయంకావాలన్నాఅందిస్తానన్నారు. జేఎన్‌టీయూ హెచ్ ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరం కలిసి కృషి చేయాలన్నారు. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ వైస్ చాన్సలర్ చొరవను అభినందిస్తూ, విశ్వవిద్యాలయం లక్ష్యాల సాధనకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన విద్యాకమిషన్ చైర్మన్

- సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలుత ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన శనివారం మంచిర్యాల జిల్లాలోని పాఠశాలలను సందర్శించారు. జైపూర్ ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతి గదులు, బోధన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఎం కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. భీమారం ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల స్థితిగతులు తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా భీమారం మండల కేంద్రంలో ఐటీఐ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పాఠశాల పూర్వ విద్యార్థి రాపల్లి రాజన్న యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, ఎంఈఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న నాగయ్య

పోరాట శక్తిని పెంచుకోవాలి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించాలని, పోరాడే శక్తిని పెంచుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో జరిగిన సిపిఎం జిల్లా మహాసభ శనివారం రెండో రోజు ముగిసింది. మహాసభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగంలోని మూలస్తంభాలైన లౌకికవాదం, ఆర్థిక స్వావలంబనను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మత ప్రాతిపదికపై విభజన తెచ్చి ప్రశ్నించే కమ్యూనిస్టులపై దాడి చేయిస్తోందన్నారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చి, పేదలపై భారాలు మోపుతోందని, నిత్యావసర వస్తువుల ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఇలాంటి ప్రమాదకర పార్టీకి సహకరిస్తే రానున్న రోజుల్లో ప్రజలకు మనుగడ లేకుండా పోతుందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహిళలు ఉచిత బస్సు రవాణా సౌకర్యం తప్ప మిగతా వాటిల్లో పూర్తిగా విఫలమైందన్నారు. పోడు భూముల సమస్య రోజురోజుకూ పెరిగిపోతోందని, ఏ ప్రభుత్వం వచ్చినా హక్కు పత్రాలు, పట్టా బుక్కులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాధికారం దక్కాలంటే మారుమూల గ్రామాల్లో సైతం ఎర్రజెండా వైపే ప్రజలు మొగ్గు చూపేలా అందరూ కృషి చేయాలని సూచించారు

అంబులెన్స్ దొంగ హల్‌చల్

- పోలీసులను పరుగులు పెట్టించిన నిందితుడు
- టేకుమట్ల వద్ద చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హయత్‌నగర్‌లో ఓ ఆస్పత్రి ముందు అంబులెన్స్‌ను చోరీ చేసిన దొంగ పట్టుబడకుండా పోలీసులను ముప్పు తిప్పలు పెట్టాడు. తనను వెంబడిస్తున్న పోలీసులకు చిక్కకుండా.. అతివేగంగా జాతీయ రహదారిపై దూసుకెళ్తూ చిట్యాల వద్ద అడ్డుకోబోయిన ఎఎస్ఐని ఢీకొట్టాడు. చివరకు టేకుమట్ల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కేతేపల్లి ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో కలిసి లారీలను అడ్డుగా పెట్టి దొంగను పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బయ్యారానికి చెందిన రావుల వెంకట రామనరసయ్య హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆస్పత్రి ముందు అంబులెన్స్ వాహనాన్ని చోరీ చేశాడు. వాహనంతో విజయవాడ జాతీయ రహదారిపై పారిపోతున్నాడు. హయత్‌నగర్ నుంచి టేకుమట్ల దాకా పోలీసులు వెంబడించినా పట్టుబడకుండా అతివేగంగా అంబులెన్స్ సైరన్‌తో దొంగ పారిపోతుండటంతో హైవేపై ఇతర పోలీసు స్టేషన్లకు సమాచారం అందించారు. చిట్యాల, కేతెపల్లి పోలీసులు అలర్ట్ అయ్యారు. చిట్యాల వద్ద పట్టుకునే క్రమంలో ఎఎస్ఐ జాన్‌రెడ్డిని ఢీకొట్టి పారిపోయాడు. జాన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ మట్టి చైతన్యమే నాకు స్ఫూర్తి

- ఏడాది పాలన ఎంతో సంతృప్తినిచ్చింది
- 'ఎక్స్'లో సిఎం రేవంత్‌రెడ్డి భావోద్వేగ పోస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి "ఎక్స్"లో భావోద్వేగమైన పోస్ట్ చేశారు. "పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలు, ఆత్మబలిదానాలు, ఆకాంక్షలు, ఆశయాలన్నింటినీ కలిపి వీలునామాగా రాసి తెలంగాణ 2023 డిసెంబర్ 7న తన చేతుల్లో పెట్టిందని పేర్కొన్నారు. వారసత్వాన్ని సగర్వంగా, సమున్నతంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యతను రాష్ట్రం తనకు అప్పగించిందని తెలిపారు. "ఆక్షణం నుంచి...జన సేవకుడిగా...ప్రజా సంక్షేమ శ్రామికుడిగా...మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో...సకల జనహితమే పరమావధిగా...జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా...సహచరుల సహకారంతో... జనహితుల ప్రోత్సాహంతో...విమర్శలను సహిస్తూ... విద్వేషాలను ఎదురిస్తూ... స్వేచ్ఛకు రెక్కలు తొడిగి... ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచి...అవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకు...గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ...నాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూ...నిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా...విరామం ఎరుగక...విశ్రాంతి కోరక...ముందుకు సాగిపోతున్నాను. ఏడాది ప్రజాపాలన ఎంతో సంతృప్తి...సమస్త ప్రజల ఆకాంక్షలు...సంపూర్ణంగా నెరవేర్చడమే నా సంప్రాప్తి" అని సీఎం రేవంత్ ఆసక్తికరంగా పోస్ట్ చేశారు.

बैंक ऑफ महाराष्ट्र
Bank of Maharashtra
ONE FAMILY ONE BANK
(A Government of India Undertaking)

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీస్, విజయవాడ

1వ అంతస్థు, ఇన్ఫినిటి ప్లాజా, డి.నెం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర.-520007.
టెలి ఫోన్ : 0866-2431225. ఈ-మెయిల్ : zmvijayawada@mahabank.co.in

డిమాండ్ నోటీసు

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్కరూల్ 8(1)తో చదువబడే ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సార్ఫసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద)

దిగువ రుణగ్రహీత యొక్క ఖాతాలు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖతో** ఎన్‌పిఎగా వర్గీకరించబడినవి, దిగువ పేర్కొన్న తేదీలలో సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును బ్యాంకు జారీచేసింది.

సంబంధితులందరికీ సమాచారం కొరకు ఈ బహిరంగ ప్రకటన ప్రచురించబడుచున్నది. దిగువ పేర్కొన్న రుణగ్రహీత/హామీదారులు సంబంధిత వ్యక్తులచేత నిర్వహించిన పత్రాలు మరియు ఇతర ఒప్పందాలు క్రింద చెల్లించు తేదీ వరకు కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు సదరు తేదీ నాటికి బాకీగా దిగువ పేర్కొన్న మొత్తాలను డిమాండ్ నోటీసు తేదీ నుండి 60 రోజుల్లోగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు** బ్రాంచికి చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు ఒప్పందాలు మరియు పత్రాల క్రింద హామీగా రుణగ్రహీతల కొరకు, వారి పేర్లకు ఎదురుగా పేర్కొనబడిన సదరు ఆస్తులు **బ్యాంక్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు** చార్జ్‌వేయబడినవి.

క్ర. సం.	ఋణగ్రహీత & సహ-ఋణగ్రహీత, బ్రాంచి పేరు / పేరు & చిరునామా	తేది.20-11-2024 నాటికి బకాయి మొత్తము
1.	బ్రాంచి పేరు : గుంటూరు ఋణగ్రహీతలు & హామీదారులు చిరునామాలతో : 1. మెస్సర్స్ పొన్నూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి కటికల స్వర్ణలత, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: 21-8-31, కెకె రోడ్, గాజులపాలెం, పొన్నూరు, గుంటూరు-522124. 2. శ్రీమతి కటికల స్వర్ణలత, (డైరెక్టర్ & హామీదారు), 102, గాయత్రి నివాస్, రాఘవ ఎన్‌క్లేవ్, రోడ్ నెం 14, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. 3. శ్రీ గుమ్మడి మనోరంజన్ (హామీదారు), ఇంటి నెం. 43-12-10/62, శ్రీ లేఖా అపార్ట్‌మెంట్స్, 4వ అంతస్తు, రైల్వే న్యూ కాలనీ, అక్కయ్యపాలెం, విశాఖపట్నం 530016. 4. మెస్సర్స్ స్నేహ ప్రియ మర్చంట్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్, (తనఖాదారు / హామీదారు), మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గుమ్మడి మనోరంజన్, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: 50-61-3, రాజేంద్ర నగర్, సీతమ్మపేట, గణేష్ గుడి దగ్గర, విశాఖపట్నం - 530016.	రూ.1,82,24,953/- (అక్షరాల ఒక కోటి ఎనభై రెండు లక్షల ఇరవై నాలుగు వేల తొమ్మిది వందల యాభై మూడు రూపాయలు మాత్రమే) ప్లస్ వర్తించని వడ్డీ / వర్తించు రేట్ల ప్రకారం భవిష్య వడ్డీ ప్లస్ తేది.20-11-2024 నుండి అపరాధ వడ్డీ ప్లస్ ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

ఋణం విధానం: క్యాష్ క్రెడిట్ ఫెసిలిటీ రూ.1,90,00,000/- (అక్షరాల ఒక కోటి తొంభై లక్షల రూపాయలు మాత్రమే)
ఖాతా నెం. : 60446894968
డిమాండ్ నోటీసు తేది : 22-11-2024 ఎన్‌పిఏ తేది : 16-11-2024
ప్రాథమిక తనఖా : తనఖాలో ఉన్న నిల్వలు మరియు పుస్తక బకాయిలు, CERSAI Asset Id: 200071990646
కొల్లెట్రాల్ సెక్యూరిటీ : తనఖాలో ఉన్న రెసిడెన్షియల్ ఖాళీ భూమి (CERSAI ID : 200071992079)
ఆస్తి షెడ్యూలు: ఆం.ప్ర., విశాఖపట్నం జిల్లా, సీతమ్మధార మండలం, కప్పరాడ & మద్రిపాలెం గ్రామం, డోర్ నెం.38-22-96/1, ప్లాటు నెం.డి-24/ఎ, ఆర్.యస్.నెం.39 వద్ద సమాన నిష్పత్తిలో తనఖా చేయబడిన కమర్షియల్ భూమి మరియు భవనము స్థలము. అందలి ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్ రెసిడెన్షియల్ భవనము & ఏసిసి రూఫ్ కమర్షియల్ గోడౌన్ షెడ్డు మెస్సర్స్ స్నేహప్రియ మర్చంట్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గుమ్మడి మనోరంజన్ గారికి చెందిన ఆస్తి. హద్దులు: ఉత్తరం : ప్లాటు నెం.డి-25/ఎ, తూర్పు: ప్లాటు నెం.డి-24, పడమర : ప్లాటు నెం.బి-13, దక్షిణం : 40 అడుగులు రోడ్డు.

సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు పై చెప్పినట్లుగా **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గుంటూరు శాఖకు** చెల్లింపులుచేయుటలో విఫలం చెందినట్లైతే, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, రాజమండ్రి శాఖ వారు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు వర్తించదు రూల్స్ పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలుతీసుకొనుట ప్రారంభించింది, సంబంధిత రు ణగ్రహీతలు/ హామీదారులు పూర్తి బాధ్యత పైననే సార్ఫసీ యాక్ట్ యొక్క నియమాలలో, సంబంధిత రుణగ్రహీతలు/హామీదారులు **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుంటూరు శాఖ** వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేకుండా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో బదిలీచేయలేరు. ఏవేని ఉలంఘనలు జరిగిన సార్ఫసీ యాక్ట్‌తో అనుసరించి, సంబంధిత వ్యక్తులకు శిక్ష లేదా జరిమానా మరియు రెండూను విధించబడు ఆస్కారం ఉంటుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలకు రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. బట్వాడా కాకుండా వెనుదిరిగిన నోటీసులను క్రింది సంతకందారు నుండి సేకరించవచ్చును. ఈ నోటీసు ప్రచురించబడుచున్నది.

తేది : 07-12-2024
ప్రదేశం : గుంటూరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, విజయవాడ జోన్

104 ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలి

- టియుఎంహెచ్‌ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖ పరిధిలోని 104 ఉద్యోగుల వేతన బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని యూనియన్ చేసిన కృషి ఫలితంగా ఈ నెల 4న రూ.12.56 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. వీటిని కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ద్వారా జిల్లాల్లోని ఉద్యోగులకు చెల్లించాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు. వేతనాలు చెల్లింపునకు కాలయాపన చేయొద్దని కోరారు. నవంబర్ నెల నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి మార్చాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారన్నారు. దీనిపైనా ఉత్తర్వులు జారీ చేసి 104 ఉద్యోగులను స్థానిక జిల్లాలకు బదిలీలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా సాధికారితకు తోడ్పాటునందిస్తాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా సాధికారతకు తోడ్పాటునందిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో హరిత ప్లాజాలో మహిళా యువ వ్యాపారవేత్తల ప్రోత్సాహక ప్రదర్శనలో ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం, శిల్పారామంలో ఇందిరా మహిళ శక్తి బజార్ సౌకర్యం, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో స్టార్ట్ అప్ కంపెనీల సేల్స్‌కు అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. ప్రతి జిల్లాలో మహిళా వ్యాపారవేత్తల ఉత్పత్తులను విక్రయించేలా అవకాశమిస్తామన్నారు వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి, 150 బస్సుల కేటాయించినట్టు చెప్పారు. సమస్త రంగాల్లో మహిళలను ముందంజలో నిలబెడుతామని చెప్పారు. మహిళా సంఘాలు తయారు చేస్తున్న సాంప్రదాయ ఉత్పత్తులను అంతా ప్రోత్సహించాలని పిలుపుని చ్చారు. కొనుగోలుదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉత్పత్తులు తయారు చేయాలన్నారు. కుట్లు అల్లికలకే పరిమితం కాకుండా మహిళలు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. స్థాయిలో మహిళల ఎదుగుదలకు పురుషులు తోడ్పాటు అందించాలని సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకునే బ్యాంకు రుణాలకు ప్రభుత్వమే వడ్డీలు చెల్లిస్తున్నదని తెలిపారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : కెజికెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని గీతకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం (కెజికెఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి వెంకటనర్సయ్య, మల్లేశంగౌడ్‌శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు ప్రభుత్వం ఇచ్చే సేఫ్టీ కిట్‌లు రూ.10 వేలు మాత్రమే పంపిణీని వృత్తి చేసే వారందరికీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా రూ.7 కోట్ల 90 లక్షలు వెంటనే విడుదల చేయాలని కోరారు. నెక్లెస్‌రోడ్‌లోని నీరా కేఫ్, నందనంలోని నీరా ప్రాజెక్ట్ టాడి కార్పొరేషన్ కోరారు.

కెసిఆర్‌ను కలిసిన మంత్రి పొన్నం

- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. కెసిఆర్‌ను ఆహ్వానించడానికి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసానికి చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బృందానికి మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వంశీధర్‌రావు తదితరులు స్వాగతం పలికారు. తన నివాసానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లంచ్ ఆతిథ్యమిచ్చి కెసిఆర్ గౌరవించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వెంట ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్రావు ఉన్నారు.

మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
యస్.ఓ.పి. నెం.1/2024

కురువ పద్మావతి మరియు ఇతరులు. ...అర్జీదారులు
-ఎదురి-
కురువ నరసయ్య మరియు ఇతరులు. ...రెస్పాండెంట్లు

4వ రెస్పాండెంట్ కు నోటీసులు

యం/యస్. షణ్ముఖ
అగ్రిటెక్ లిమిటెడ్ కార్పొరేట్ ఆఫీస్,
7-1-621/98, యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా,
యస్. ఆర్.నగర్ మెయిన్ రోడ్డు, హైదరాబాద్

పై నెంబర్ యస్. ఓ. పి లో అర్జీదారులు, మొదటి అర్జీదారు భర్త అలాగే 2,3,4అర్జీదారుల తండ్రి అయిన కురువ సూర్య నరసింహ చనిపోయినందున ఇతని వారసులు అయినా అర్జీదారులు మేమే వారసులమని వారసత్వ సర్టిఫికెట్ ఇప్పించమని పై కోర్టులో అర్జీ దాఖలు చేసినారు. అలాగే తమ భర్త/తండ్రిగారి పేరు పైన అర్జీ లో షెడ్యూల్ లో కనబరిచిన న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ,జీ.పి.ఎ పాలసీ అమౌంటును అర్జీదారుల పేరుపైన మార్చవలసిందిగా కోరుతూ హైకోర్టులో అర్జీ దాఖలు చేసినారు.ఇందులో 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఏమైనా అక్షేపణ ఉన్న యెడల 18-12- 2024 వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుసుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

వాయిదా:18-12-2024

Y. Randeep Kumar Reddy,
G. BharathKumar,
అర్జీదారుల తరపు అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No:944/2023
IN
O.S.No:123/2016

ఆదెన వెంకటశేషమ్మ ...పిటీషనర్/వాది
Vs.
రాగినబోయిన సుబ్బులు (died) & ఇతరులు .... రెస్పాండెంట్స్

ప్రకటన.

To,
R3) పుల్లెల ప్రమోద్ కుమార్
S/o ఆదిశేఖర్ ప్రవేట్ ఎంప్లాయి,
R/o హౌస్ నెంబరు : 7-1-70/B/1,
ఆమీర్ పేట్, హైదరాబాద్-500016.

పై దావాలో మూడవ ప్రతివాదిగా మిమ్ముల్ని చేర్చమని సి.పి.సి. ఆర్డర్-1 రూల్-10 ప్రకారం దాఖలు చేసిన పై నంబరు పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు పిటీషన్ లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ పిటీషన్‌ను తేది. 16-12-2024నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఏదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పై పిటిషన్ లో మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేని ఏడల పై పిటిషన్ ను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి, బి.యస్.సి.,బి.యల్.,
పిటీషనర్ తరపు న్యాయవాది

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.10/2020
In
O.S.No.11/1997

1.గూడా రాజసులోచన & ఇతరులు ...డి.హెచ్.ఆర్స్
Vs
1.యలవర్తి సత్యవతి & ఇతరులు ...జె.డి.ఆర్స్

ప్రకటన.

To :
1.యలవర్తి సత్యవతి W/o భైరవస్వామి (J.D.R-1)
2.గంటా వెంకటలక్ష్మి W/o వెంకటేశ్వర్లు (J.D.R-4)
ఇద్దరి నివాసం, ఫ్లాట్ నెంబరు - 101, ఫస్ట్ ఫ్లోర్, లక్ష్మిఅపార్ట్ మెంట్, హుడా కాలనీ, (హైకోర్ట్ కాలనీ), సరూర్ నగర్, హైదరాబాద్- తెలంగాణా స్టేట్.

జిల్లా కోర్ట్, ఒంగోలు పైలు A.S.నెంబరు 152/2009 ఉత్తర్వుల మేరకు తేది 11-11-1993 విక్రయ అగ్రిమెంట్ షరతుల ప్రకారం రిజిష్టర్డు విక్రయ దస్తావేజును ఎక్జిక్యూట్ చేయమని దాఖలు చేసిన పైనెంబరు ఇ.పి.లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికీ మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు ఇ.పి.లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ ఇ.పి ను తేది:03-01-2025నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు కోర్టువారి ఏదుట స్వయముగా గాని వకీలు ద్వారాగాని హాజరయి ఇ.పి.లో మీఆక్షేపణలు తెలియ జేయవలెను. లేని ఏడల పై ఇ.పి.ను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు. అద్దంకి

సిపిఎం రాష్ట్ర మహాసభ విజయవంతానికి సన్నాహాలు

- పటాన్‌చెరులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం రాష్ట్ర మహాసభ విజయవంతానికి సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా సిపిఎం పని చేస్తోందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎందరో జీవితాల్లో వెలుగును నింపిన వారమవుతామన్నారు. తమ పార్టీ ప్రజా ఉద్యమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని తెలిపారు. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభ జరుగనుందని చెప్పారు. అందరూ సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి రాజు, అనిత సిస్టర్, సిపిఎం ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు రామకృష్ణ, నర్సింహులు, శాంత కుమార్, లకాన్ పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

- ఆహ్వాన సంఘం చైర్మన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- రాష్ట్ర మహాసభ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి పట్టణంలో తొలిసారిగా జరుగనున్న సిపిఎం రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని, ప్రతి కార్యకర్తా కష్టపడి పని చేయాలని ఆహ్వాన సంఘం చైర్మన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. జనవరి 25 నుంచి 28 వరకు జరగనున్న రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్‌ను శనివారం సంగారెడ్డిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిపిఎం బలమైన కార్మిక, కర్షక, రైతాంగ పోరాటాలను నిర్వహించి ప్రజల మద్దతు పొందిందన్నారు. పార్టీ విధానాలు, పోరాటాలు, ఎర్రజెండా గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మహాసభను విజయవంతం చేసేందుకు ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఆర్థికంగా, హార్థికంగా సహకరించాలని కోరారు. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ విధానాలతో సిపిఎం పని చేస్తోందన్నారు. రాబోయే కాలంలో మరిన్ని సమరశీల పోరాటాలు సాగించే దిశగా మహాసభలో నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, రేవంత్, నాగేశ్వర్ రావు, లలిత, కృష్ణ పాల్గొన్నారు.

అసెంబ్లీలో లగచర్ల సమస్యను లేవనెత్తుతాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో లగచర్ల సమస్యను లేవనెత్తుతామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పారు. అక్కడ భూ సేకరణ రద్దయ్యే వరకూ పోరాడుతామని ఆయన వ్యాఖ్యానించారు. లగచర్లకు చెందిన పలువురు భూ సేకరణ బాధితులు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చారు. కెటిఆర్‌ను కలిసి, వారు తమగోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల ఘటనకు సంబంధించి అన్యాయంగా నమోదు చేసిన కేసులన్నింటినీ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాసగౌడ్, సీనియర్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడూ ప్రజల కోసమే పని చేస్తాం

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే పని చేస్తామని కెటిఆర్ వ్యాఖ్యానించారు. మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకులు రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన "నమ్మి నానపోస్తే" అనే లఘు చిత్రాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచేందుకోసం కాంగ్రెస్ ఇచ్చిన అడ్డగోలు హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

నత్తనడకన ఆర్‌ఓబి పనులు

- రూ.78 కోట్లతో ఫాతిమానగర్ వద్ద పొడవైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం
- రైల్వే శాఖ తీరుపై అసంతృప్తి

రైల్వే ఓవర్ బ్రిడ్జి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హన్మకొండ-కాజీపేట రైల్వేలైన్ మధ్యనున్న ఫాతిమానగర్ వద్ద అత్యంత పొడవైన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) నిర్మాణానికి ఏడేండ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికీ పూర్తికాలేదు. నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఆర్ఓబి నిర్మాణానికి నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2017లో రూ.78 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను రెండేండ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ప్రధానంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు తీవ్ర జాప్యం చేయడం ఈ ఆర్ఓబి నిర్మాణానికి ప్రతిబంధకంగా మారింది. ఈ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు స్థానిక ఎమ్మెల్యే, ఎంపి అంటున్నారు. ఆర్ఓబి నగరానికి నడిఒడ్డున ఉండటంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడి నగరవాసులకు ఇబ్బందికరంగా మారింది. కాబట్టి బ్రిడ్జి త్వరగా నిర్మించి వాహనదారుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కాజీపేట-బల్లార్ష రైల్వేలైన్ మీదుగా 1970లో నిర్మించిన ప్రస్తుత ఫాతిమానగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నగరంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీకనుగుణంగా లేదు. నాటి జనాభాతో పోల్చితే గ్రేటర్ వరంగల్ నగర జనాభా పెరిగింది. వాహనాలు పెరిగి తీవ్ర ట్రాఫిక్ రద్దీతో నగరవాసులు సతమతమవుతున్నారు. దాంతో నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం పాత బ్రిడ్జికి సమాంతరంగా మరోరైల్ ఓవర్ బ్రిడ్జిని (ఆర్ఓబి) నిర్మించడానికి రూ.78కోట్లతో నాటి సిఎం కెసిఆర్ 2017 అక్టోబర్ 22న శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణాన్ని డిసెంబర్ 31, 2021లో పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు పూర్తికాలేదు. పలు సందర్భాల్లో ప్రస్తుతం ఉన్న ఆర్ఓబిపై ప్రమాదం జరిగితే రెండువైపులా గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

అత్యంత పొడవైన ఆర్ఓబి

జాతీయ రహదారి 163 మీద హన్మకొండ-కాజీపేట మధ్య ఫాతిమానగర్ వద్ద నిర్మిస్తున్న ఆర్ఓబి అత్యంత పొడవైనదని ఆర్అండ్‌బి అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్ఓబిలో రైల్వే ట్రాక్ మీద వినియోగించనున్న గడ్డర్స్ బరువు 800 టన్నులు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆర్అండ్‌బి హన్మకొండ జిల్లా అధికారులు రెండు వైపులా, ట్రాక్‌పై మినహా నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ గడ్డర్స్‌ను ఆర్ఓబిలో వినియోగించడానికి ఇంత భారీ బరువును ఆపగలిగేలా స్ట్రక్చర్‌ను ఏర్పాటు చేసి రెండు భారీ క్రేన్‌లతో అమర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే ఫాతిమానగర్ సెయింట్ గాబ్రియేల్స్ హైస్కూల్ మైదానానికి రెండు గడ్డర్స్ చేరుకున్నట్టు ఆర్అండ్‌బి అధికారులు తెలిపారు.

రైల్వే అధికారుల జాప్యం

గడ్డర్స్ నిర్మాణంలో వినియోగించే మెటీరియల్, దాని డిజైనింగ్, తయారీ విధానాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సందర్శించి ధృవీకరించడంలోనే తీవ్ర జాప్యం జరిగింది. నాలుగేండ్లుగా రైల్వే ట్రాక్‌పై 150మీటర్ల మేరకు పనులు నిలిచిపోయాయి. రైల్వే మంత్రిత్వ శాఖ మార్గదర్శక సూత్రాల మేరకు ఈ ఆర్ఓబి నిర్మాణంలో భాగంగా ట్రాక్ మీదుగా బ్రిడ్జిలో చేసే నిర్మాణం యావత్తు రైల్వే అధికారుల పరిశీలనలో చేయాల్సి ఉంది. ఇందుకు వినియోగించే మెటీరియల్‌ను స్వయంగా రైల్వే ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి ధ్రువీకరించాలి. ఇదే క్రమంలో ఆర్ఓబికి వినియోగించే గడ్డర్స్ డిజైనింగ్, నిర్మాణాన్ని తయారీ కేంద్రం వద్దకు స్వయంగా వెళ్లి పరిశీలించి నాణ్యతను ధృవీకరించాకే గడ్డర్స్‌ను ప్రతిపాదిత ఆర్ఓబి స్థలానికి తరలిస్తారు. కాగా, ఈ విషయాన్ని వరంగల్ ఎంపి కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఈ పనుల్లో వేగం పెరగకపోవడం గమనార్హం. దేశవ్యాప్తంగా ఆర్ఓబిలు పెద్ద సంఖ్యలో ఉండడం వల్ల రైల్వే అధికారులు సకాలంలో పర్యవేక్షణ, పరిశీలన పూర్తి చేసి ధ్రువీకరించలేక పోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మార్చిలోపు పూర్తి

పి.సురేష్‌బాబు, ఆర్అండ్‌బి ఇఇ, హన్మకొండ

2025 మార్చిలోపు ఫాతిమానగర్ ఆర్ఓబి పనులు పూర్తి కానున్నాయి. ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో జరగాల్సిన పనులు పూర్తి చేశాం. దక్షిణ మధ్య రైల్వే అధికారులు రైల్వే ట్రాక్‌పై ఆర్ఓబిలో వినియోగించే గడ్డర్స్ నిర్మాణంలో పూర్తిగా రైల్వే అధికారుల పరిశీలన, నిర్ధారణ చేసి ధ్రువీకరించిన తరువాతే పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే రెండు గడ్డర్స్ ఫాతిమానగర్‌కు చేరుకున్నాయి. వచ్చే మార్చిలోపు నిర్మాణం పూర్తవుతుంది.

ఫాసిజాన్ని ఆదిలోనే అడ్డుకోవాలి

- అధికారంలోకి వస్తే అనర్థాలే
- ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలి
- 'ముఖాముఖి'లో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫాసిజం అధికారంలోకి వస్తే దాన్ని తప్పించడం చాలా కష్టమనీ, ప్రారంభంలోనే దాన్ని అడ్డుకోవాలని సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య చెప్పారు. ఆ పార్టీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో మేధావులు, ప్రజాస్వామికవాదులతో 'ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, కేంద్రకమిటీ సభ్యులు ఎన్ మూర్తి, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర శాఖల కార్యదర్శులు మామిండ్ల రమేష్‌రాజా, క్లిఫ్టన్‌తో పాటు సీనియర్ జర్నలిస్ట్ ఎన్ రామచంద్రమూర్తి, మల్లేపల్లి లక్ష్మయ్య, హెచ్చార్కే, పట్టు వెంకటేశ్వర్లు, బిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ.. దేశంలో బిజెపి విస్తరణ ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదమని చెప్పారు. సమాజంలో లెఫ్ట్ ఫోర్స్‌ల ప్రభావం పెరగాల్సి ఉందన్నారు. ప్రజాపోరాటాలు, ఉద్యమాలు మరింత పటిష్టంగా నిర్మితమవ్వాలని చెప్పారు. రాజ్య విస్తరణ కోసం బిజెపి కులాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నదనీ, దాని అమల్లో భాగంగా మొదట ప్రజల్లో మత ప్రాతిపదికన విభజన సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నదని వివరించారు. ఫాసిజం అధికారంలోకి వస్తే, క్రోనీ క్యాపిటలిజం పెరుగుతుందనీ, ఇప్పుడు దేశంలో జరుగుతున్నది అదేనని విశ్లేషించారు. అన్ని రాష్ట్రాల్లోనూ నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారనీ, కానీ ఆయన చెప్పిన విధానాలను ఎక్కడా అమలు చేయట్లేదని ఆక్షేపించారు. కులరహిత ఎన్నికలు, సమాజాన్ని అంబేద్కర్ కాంక్షించారని గుర్తుచేశారు. ప్రయివేటీకరణను వ్యతిరేకించి, జాతీయాకరణను కోరుకున్నారని చెప్పారు. వీటిని పాలకవర్గాలు పట్టించుకోవట్లేదన్నారు. చివరకు భారత రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులరిజం అనే పదాలను ఫాసిస్టులు తొలగించారని ఉదహరించారు. దేశంలో బిజెపి విస్తరణను నిలువరించాలనీ, దీనికోసం వామపక్ష, ప్రజాస్వామిక, లౌకికవాద శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.

వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పిల్లలు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

- మూఢ నమ్మకాలను వీడాలి
- ఎన్ఐటి రిటైర్డ్ ప్రొఫెసర్ కె.రాంచంద్రయ్య
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలిలో బలోత్సవ ముగింపు వేడుకలు
- పాల్గొన్న విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిల్లలు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని, మూఢ నమ్మకాలను వీడాలని ఎన్ఐటి రిటైర్డ్ ప్రొఫెసర్ కె.రాంచంద్రయ్య సూచించారు. సుందయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలిలో రెండు రోజులపాటు బాలోత్సవం వేడుకలు నిర్వహించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకలకు రాంచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. సైన్స్ మరింత అభివృద్ధి చెందాలంటే భవిష్యత్‌లో గొప్ప శాస్త్రవేత్తలు కావాలన్నారు. అందులో భాగంగానే సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిందని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చెకుముకి పత్రికను తీసుకుని, అందులోని సైన్స్ మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు డాక్టర్స్‌గా, ఇంజినీర్స్‌గా, వివిధ రంగాల్లో రాణించాలన్నారు. చదువుతోపాటు ఇతర సాంస్కృతిక రంగాలపై దృష్టి సారించాలని చెప్పారు. సభ అధ్యక్షులు పి.ప్రభాకర్ మాట్లాడుతూ.. సుందరయ్య పేద ప్రజల కోసం నిరంతరం పని చేశారని గుర్తు చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెద్ద లైబ్రరీ ఉందని, అందులో లక్షల పుస్తకాలు ఉన్నాయని వాటిని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. టీచర్లు, మేధావులు, పరిశోధకులు ఉపయోగించుకోవాలన్నారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బస్తీ ట్యూషన్‌లు, మెడికల్ క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలతోపాటు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించడానికి బాలోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, డ్యాన్స్, వ్యాసరచన, ఉపన్యాసం, జనరల్ నాలెడ్జ్, లఘు చిత్రాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గండిపేట, శేరిలింగంపల్లి, మణికొండ, షేక్‌పేట్, నార్సింగ్, దర్గా, గచ్చిబౌలి కొండాపూర్, కొత్తగూడ, లింగంపల్లి, తదితర ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎంఈఓ వెంటకయ్య, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ఆర్.సాంబశివరావు, బాలోత్సవ కన్వీనర్ సి.విజయ్‌కుమార్, విజ్ఞాన కేంద్రం బాధ్యులు రవీందర్, అనిల్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలమల్లేష్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాల మల్లేష్ మరణం వ్యవసాయ కార్మిక సంఘానికి తీరని నష్టమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అన్నారు. శనివారం శంషాబాద్‌లో జరిగిన బాలమల్లేశ్ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ, దళితుల సమస్యలకు సంబంధించిన ఐక్య ఉద్యమాల్లో బాల మల్లేశ్‌తో కలిసి పని చేశామని గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ కార్మికోద్యమాన్ని నిర్మించడంలో ఆయన సలహాలు సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. బాల మల్లేష్ స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలను నిర్మిస్తామని వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఉప ముఖ్యమంత్రికి తెలంగాణ ఉద్యోగుల జాక్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్, ఉపాధ్యాయుల, కార్మిక, పెన్షనర్ల యాక్షన్ కమిటీ (టిజిఇజెఎసి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో టిజిఇజెఎసి అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావులతో కూడిన ప్రతనిధి బృందం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించింది. కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలనీ, జిఒ 317ను సమీక్షించి బాధితుల బదిలీల కొసం సూపర్ న్యూమరిక్ పోస్టులను కల్పించి స్థానికత కోల్పోయిన ఉద్యోగులను తిరిగి వారి జోన్లకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లేదా ఆఫీసర్స్ కమిటీ ఏర్పాటు చేసి ప్రధాన ఉద్యోగ సంఘాలకు గుర్తింపునివ్వాలనీ, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల కోసం రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీని ఏర్పాటు చేయాలనీ, పీఆర్సీ-2020కి సంబంధించిన బిల్లులను ఆర్థిక శాఖకు బదులుగా ట్రెజరీల ద్వారా అడ్మిట్ చేయడానికి అనుమతించాలని విన్నవించారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సర్వీస్ పొడగింపు, రీ ఎంప్లాయిమెంట్‌ను నిలిపి వేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కాలాన్ని నాలుగు సంవత్సరాల నుంచి రెండు సంవత్సరాలకు తగ్గించి ప్రమోషన్లు కల్పించాలనీ, శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లిలోని సర్వేనెంబర్ 37లో ఉన్న టీఎన్‌జీవో ఫేస్-2 యొక్క101.02 ఎకరాల స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమాన సహకారంతో ఆరోగ్య పథకం అమలు చేయాలనీ, అన్నీ శాఖల్లో పని భారాన్ని తట్టుకోవడానికి కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో అదనపు పోస్టులను మంజూరు చేయాలనీ, ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశపెట్టిన ఉమ్మడి టైం టేబుల్‌ను మార్పు చేయడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలనీ, లగచర్ల, దీలావర్‌పూర్ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. త్వరలో ప్రాధాన్యత క్రమంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. భట్టిని కలిసిన వారిలో జేఏసీ నాయకులు కె.జంగయ్య, వంగ రవిందర్‌రెడ్డి, ఎం.పర్వతరెడ్డి, పి.మధుసూధన్‌రెడ్డి, ఎండీ. అబ్దుల్లా, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కృష్ణుడు, రాధాకృష్ణ, పోచయ్య, కృష్ణమూర్తి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

డీజిల్ కుంభకోణంలో సస్పెన్షన్

- గుండెపోటుతో ఉద్యోగి మృతి
- మృతదేహంతో బల్దియా ఎదుట కుటుంబీకుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డీజిల్ కుంభకోణంలో నిందితుడిగా ఉన్న సామాన్య ఉద్యోగి రఘు గుండె పోటుతో మృతిచెందారు. దీంతో మృతదేహాన్ని బల్దియా ఎదుట ఉంచి కుటుంబీకులు ధర్నా చేశారు. ఇందుకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో డీజిల్ కుంభకోణంలో నిందితుడిగా రఘు ఉండటంతో అప్పుడు అధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల కోర్టు బెయిల్ తీసుకొని ఇంటికి వచ్చాడు. అయితే, ఉద్యోగం నుంచి అధికారులు సస్పెండ్ చేయడంతో మనస్తాపానికి గురవ్వడంతో రఘుకు గుండెపోటు వచ్చి ప్రాణం కోల్పోయారు. దాంతో శనివారం వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట మృతదేహాన్ని పెట్టి కుటుంబీకులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అదనపు కమిషనర్ జోన ఘటనా స్థలానికెళ్లి వారితో మాట్లాడారు. కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ కోరుతూ

ఇంటర్ బోర్డు ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

- నారాయణ, శ్రీచైతన్యలను రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ధర్నా నిర్వహించారు. విద్యార్థుల ఆత్మహత్యలకు గల కారణాలను అన్వేషించి, వెంటనే వాటిని నివారించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుల జోక్యంతో ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందం ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నారాయణ, శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. అందుకు కారణమైన ఆ కళాశాలల యాజమాన్యాలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. ఇంటర్ బోర్డు అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవటానికి కారణాలేంటో బైటపెట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల వేధింపులు, ర్యాంకులు, మార్కులు కోసం తీవ్ర ఒత్తిడికి గురిచేయటం ఏ విద్యా విధానంలో భాగమో చెప్పాలని నిలదీశారు. రివిజన్ పేరుతో ఒత్తిడి పెంచి మార్కెట్ మాయజాలం కోసం రూ.కోట్ల ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా చూస్తోందని ఆరోపించారు. నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే రాయితీలిచ్చి మరీ అడ్మిషన్లు చేస్తున్నారనీ, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ఆ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న మంత్రి నారాయణ తన విద్యాసంస్థల్లో విద్యార్థులు చనిపోతున్నా కనీసం స్పందించక పోవటం విడ్డూరంగా ఉందన్నారు.విద్యార్థుల మరణాలకు భాద్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ అధికారులు తక్షణమే హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసి ,అనుమతులు లేకుండా నడుస్తున్న క్యాంపస్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పద్ధతికి అనుమతి ఇవ్వకుండానే హాస్టళ్లను నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు ఫీజులను వసూళ్లు చేస్తున్నారన్నారు. వాటిపై ఐటి దాడులు చేయాలని డిమాండ్ చేశారు.ఈ అంశాలపై టీమ్ వేసి విచారణ జరుపుతామనీ, వెంటనే చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు దామెర కిరణ్, కె.అశోక్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, ఉపాధ్యక్షురాలు చరణశ్రీ, శ్రీమాన్, నాగేందర్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివ, స్టాలిన్, లిఖిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం విఘ్నేష్,మనోజ్, అరుణ్,లక్ష్మణ్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

భావోద్వేగాలను రెచ్చగొడుతున్న బిజెపి

- సిపిఐ నేత బాల మల్లేష్ సంతాప సభలో ప్రొఫెసర్ హరగోపాల్
- వ్యవసాయాన్ని కార్పొరేట్ చేతుల్లో పెట్టే కుట్ర
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు దృష్టి మరల్చకుండా కుల, మత విద్వేషాలను బిజెపి ప్రభుత్వం బహిరంగంగా రెచ్చగొడుతోందని పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బికెఎంయు రాష్ట్ర సమితి కార్యదర్శి బాల మల్లేష్ సంతాప సభ రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో శనివారం నిర్వహించారు. హరగోపాల్‌తోపాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. బాల మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హరగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో నేటికీ 60 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వ్యవసాయం సంక్షోభంలో పడటానికి పాలకులే ప్రధాన కారణమని చెప్పారు. కేంద్రంలో బిజెపి సర్కార్ రైతు వ్యతిరేక చట్టాలు చేసిందన్నారు. రైతు పోరాటాల ఫలితంగా వాటిని తాత్కాలికంగా వెనక్కి తీసుకుందని తెలిపారు. అయితే, ఈ చట్టాలు ప్రజల మెడపై వేలాడుతున్న కత్తిలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వ్యవసాయాన్ని కార్పొరేట్ల చేతిలో పెట్టే కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికే విద్య, వైద్య రంగాలను పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల నుంచి ప్రతిఘటన ప్రారంభమైందన్నారు. ఢిల్లీలో రైతులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారని, వారికి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల మధ్య విభజన రేఖలు గీస్తూ భావోద్వేగాలతో ఆటాడుకుంటున్న వారిని అడ్డుకోవాలని సూచించారు.

కార్మికుల ఆలోచనలో మార్పు రావాలి: సాంబశివరావు

దేశంలో కార్మికులు, వ్యవసాయ కూలీలు, అట్టడుగు వర్గాల ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలని ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. రైతులు, రైతు కూలీలకు మద్దతుగా కమ్యూనిస్టులు అనేక త్యాగాలు, పోరాటాలు చేశారని వివరించారు.

అయితే, కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ఎన్నికల సందర్భంలో పోటీలో నిలబడినప్పుడు మాత్రం కార్మికవర్గం ఓట్లు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా అనుకూలమైన మేధావులను జైల్లో వేస్తున్నారని, మైనింగ్, భూమాఫియా, కబ్జాకోరులు మాత్రం దర్జాగా చట్టసభల్లో అడుగు పెడుతున్నారని అన్నారు. రైతు, కార్మిక సంఘం నేత ప్రసాద్ ఖమ్మం జిల్లాలో మరణించిన మరుసటి రోజే బాల మల్లేష్ కూడా దూరమవ్వడం తనను తీవ్రంగా బాధించిందన్నారు. నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టులను తయారు చేయడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాల మల్లేష్ ఆశయాల కొనసాగింపుగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు నిర్మించడం, ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బికెఎంఎస్ జాతీయ కార్యదర్శి నిర్మల్, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగంటి పర్వతాలు, నాయకులు అజీజ్ పాషా, ఓరుగంటి యాదయ్య, అంజయ్య, పద్మ, నర్సింగరావు, శంకర్, సాగర్ గౌడ్, రమేష్, బి.జంగయ్య, గిరి పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ప్లాట్లు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- వరంగల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటులో భూములు కోల్పోయిన 863 మంది నిర్వాసితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్లాట్లు ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేటలో శనివారం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, 863 ఆర్ఎన్ఆర్ ప్లాట్లు కలిగిన లేఅవుట్‌ను, వెటర్నరీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు, ఎమ్మెస్సీమీ పార్క్ (మైక్రో మినీ స్మాల్ ఇండస్ట్రీస్)లో రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి సరఫరా తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో సంగెం మండలం లోహిత నుంచి గోపనపల్లి గ్రామం వరకు రూ.4 కోట్ల 80 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ భూనిర్వాసిత లబ్దిదారులకు పట్టాలు అందించారు. డ్రా పద్ధతిలో లే అవుట్ ప్లాట్ల కేటాయింపు నిర్వహణను ప్రారంభించారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్క్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు కనీసం 74 చదరపు గజాలు లేదా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో వరద వల్ల ముంపునకు గురికాకుండా డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు సీఎం ఇటీవల నిధులు మంజూరు చేశారని తెలిపారు. పార్క్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తామని, స్కిల్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణ ఇప్పించి టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి కల్పిస్తామని చెప్పారు. భూ నిర్వాసితులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. డ్రా పద్ధతిలో కేటాయించిన లేఔట్ ప్లాట్లలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, శాసనసభ్యులు కెఆర్.నాగరాజు, రాష్ట్ర గిడ్డంగుల చైర్మెన్ రావుల రాజేశ్వరరావు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కుడా చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.